విధులకు నివేదించి వుండకపోవడం వేంకటసుబ్బారావుగారు గుర్తించారా ?

రాష్ట్రీయాభిమానాన్ని నిరసిస్తూ యీమధ్య గాంధీగారిచ్చిన స్టేటుమెంటు మొన్న మొన్న, ఆంధ్రరాష్ట్రాన్ని గురించి ఏ. ఐ. సీ. సీ వారు బొంబాయిలో చేసిన తీర్మానాన్ని తుడిచి పారెయ్యడానికే అని వేంకటసుబ్బారావుగారిప్పటికయినా తెలుసుకున్నారా ?

ఈ స్టేటుమెంటు ఇండియా మంత్రికి ఎలాంటి భావం పుట్టిస్తుందో, దీనిమీద పట్టాభిగారు చేసిన వ్యాఖ్యానం ఆంధ్రులమీద ఎంత తీవ్రమైన మత్తుమందుగా పనిచేస్తుందో కూడా వారు గ్రహించుకున్నారా ?

చివరికి వేంకటసుబ్బారావుగారి కొక్కటే మనవి.

ఆంధ్రమహాసభ ఏట్లో కలిసిపోనివ్వండి.

బెంగవద్దు.

కాంగ్రెస్సు బతుకంతా బట్టబయలు చెయ్యండి.

రాజగోపాలాచారిగారి ప్రభుత్వం మనకీవిషయంలో చాలా వుపకరిస్తోంది.

రాజగోపాలాచారిగారి యెత్తులకు వ్యాఖ్యానం చేస్తే చాలు, ఆంధ్రయువయువతులకు ఆంధ్రోద్యమం విషయమై వేరే ప్రచారం యేమీ చెయ్యనక్కరలేదు.

ఆంధ్రమహాసభకి మమ్మల్ని రమ్మనకండి.

మీరు కూడా అధరిమానాకి వెళ్ళకండి.

బాగా ఆలోచించండి.

## అస్పృశ్యుల దేవాలయ ప్రవేశం

మధురమీనాక్షమ్మ గుడిలో అస్పృశ్యులు ప్రవేశించారు.

తంజావూరిలో కూడా, బృహదీశ్వరాలయంలోనూ, మరో తొంభై గుళ్ళల్లోనూ అస్పృశ్యులు అడుగు పెట్టారు.

భరతఖండం మొత్తంమీద వుండిన గొప్ప దేవాలయాలలో యీ మొదటివి రెండూ మొదటి శ్రేణిలోవి.

అంచేత, సనాతనుల పక్షంగా చూసినా, సంస్కర్తల పక్షంగా చూసినా యిది గుండెలు వూపేసే విషయం.

కాగా,

ఈ పునాదిమీద, వొక్కొక్కటే వొక్కొక్కటే—మద్రాసు ప్రెసిడెన్సీలో వున్న గుళ్ళన్నీ కొద్ది కాలంలోనే అస్పృశ్యుల కందుబాటయిపోవచ్చు.

కాని,

శాసనం పుట్టిన మలబారు, మహారాష్ట్ర కోయ అయిపోయి వుండగా, ఆశాసనానికి వ్యాప్తి లేనిచోట—యెవరూ అనికోనిచోట యిది ప్రారంభం అయింది.

ప్రభుత్వం వైష్ణవస్వాముల చేతిలో వుండగా, సంస్కారం శైవక్షేత్రాలలో విరుచుకు పడింది.

ఇది గమనించతగ్గ విషయం.

అయితే,

దీనివల్ల అస్పృశ్యులకు కలిగే ప్రయోజనం యేమిటి ?

ఇది వారి కోరికా ?

వారి అభ్యుదయానికిది అగత్యమా ?

అకలితోటీ, అవమానాలతోటీ వుడికిపోతూ వున్న అస్పృశ్యుల యువయువతులను ఇది ఆకర్షించగలుగుతుందా ?

పోనీ,

ఆచారమూ, మూఢభక్తీ కలిగివున్న సవర్ణవృద్ధుల్లోనే దేవాలయప్రాముఖ్యం ప్రబలి వుండడం తెలుసా ?

ప్రపంచప్రవృత్తి గుర్తించి నాని కథియుగంగా పోతూ వున్న సవర్ణయువయువతులు దేవాలయాలకు వెళ్ళి అర్చనలు చేసే పరిస్థితులేమయినా కనపడుతున్నాయా ?

అసలీ దేశంలో యికముందు విగ్రహారాధన ఆచరణలో వుంటుందా ?

అథవా,

"గుడి" అనేది పోకపోయినా యిన్ని రకాల దేవుళ్ళూ, అమ్మవార్లూ నిలుస్తారా ?

సంస్కర్తలు తమ సిద్ధాంతాలను సనాతనులమీద రుద్దడం ధర్మం అయితే, మతాంతరులు హిందూమతంమీద దండెత్తడం అక్రమం అవుతుందా ?

ఎటు చూసినా అస్పృశ్యుల దేవాలయప్రవేశం శాసించేవారూ, సమ్మతించేవారూ, సమర్థించేవారూ భావదాసులనే చెప్పవలసి వస్తోంది.

అస్పృశ్యులలో, క్షుద్రదేవతారాధన తప్పించి, సత్యం బోధపరిచి, యేకేశ్వరోపాసన ప్రవేశపెట్టడానికి బదులు, సంస్కర్తలు ఇలాగ బహుదేవతారాధన ప్రవేశపెట్టడం మౌఢ్యమూ, మౌర్ఖ్యమూ తప్ప మరేమీ కాదు.

అస్పృశ్యులను సవర్ణుల పాఠశాలల్లో ప్రవేశపెట్టలేని సంస్కర్తలు—అస్పృశ్యులను ప్రత్యేక "పల్లె" లలో నుంచి గ్రామాలలోకి—సవర్ణుల మధ్యకు బదిలీ చెయ్యలేని సంస్కర్తలు—అస్పృశ్యులను సవర్ణుల జలాధారాలు వాడుకునేటట్టు చెయ్యలేని సంస్కర్తలు, వారిని దేవాలయాలలోకి తీసుకు వెళ్ళడం బాధ్యత తప్పించుకోడమూ, వంచించడమూ మాత్రమే అవుతుంది.

ఇదిలా వుండగా,

ఈ దేవాలయాలు మన జాతికి అజ్ఞానం కలిగించాయి.

భగవంతుణ్ణి మరిపించాయి.

మానవత్వమే కలుషితం చేసేశాయి.

అస్పృశ్యులయినా యీ సంగతి గుర్తించి, సంస్కర్తల అజ్ఞానమున్నూ గమనించి, దేవాలయాలను బహిష్కరించకపోతే యింకా కిందపడిపోతారు.

మరి బాగుపడరు.